సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఆదాయ బాటలో ఆర్టీసీ

ఆర్టీసీ అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. సంస్థకు ఆదాయం తెచ్చి పెడుతున్నారు. రూ. 2 కోట్ల నష్టాన్ని అధిగమించారు.

8లో

గరిష్టం/కనిష్టం
33.9°/ 10.8°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

'స్పందన' రద్దు

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. వినతిపత్రాలు సమర్పించేందుకు ఎవరూ జిల్లా కేంద్రానికి రావొద్దని విజ్ఞప్తి చేశారు.

పుట్టపర్తి టౌన్: క్రిస్మస్ సందర్భంగా 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కలెక్టర్ క్రిస్మస్ శుభాకాంక్షలు



పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని క్రిస్టియన్లకు కలెక్టర్ అరుణ్ బాబు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఏసు ప్రభువు సూచించిన మార్గంలో నడవాలని కలెక్టర్ సూచించారు.

మడకశిర తహసీల్దార్ ముర్షావలీ సస్పెన్షన్



పుట్టపర్తి అర్బన్: మడకశిర మండల తహసీల్దార్ ముర్షావలీని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ అరుణ్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు.. మండలానికి చెందిన ఓ రైతు భూమి సమస్యపై అర్జీ సమర్పించారు. రోజులు గడిచినా సమస్యను కిందిస్థాయి అధికారులు పరిష్కరించకపోవడంతో రెండు రోజుల క్రితం తహసీల్దార్ ముర్షావలీ వద్దకు వెళ్లారు. కింది స్థాయి అధికారులు డబ్బులు అడుగుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. తన సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డబ్బులివ్వందే పనికాదని తెలిపారు. సదరు రైతుతో తహసీల్దార్ మాట్లాడిన మాటలను రికార్డు చేసిన కొందరు ఆదివారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. విషయం కలెక్టర్ అరుణ్‌బాబు దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఆయన తహసీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అక్క మృతిపై సోదరుడి ఫిర్యాదు

గాండ్లపెంట: తన అక్క మృతిపై అనుమానాలున్నాయని, విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని కోరుతూ ఓ సోదరుడు ఫిర్యాదు చేసిన ఘటన మండల పరిధిలోని గొడ్డువెలగల పంచాయతీలో ఆదివారం చోటుచేసుకుంది. హెచ్‌సీ రామయ్య తెలిపిన మేరకు.. మండల పరిధిలోని గొడ్డువెలగల పంచాయతీ నరసప్పగారిపల్లికి చెందిన పార్వతి (40), జయరాములు దంపతులు. జీవాలు పెంచుకుంటూ వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం ఇద్దరూ జీవాలు తోలుకుని గ్రామ సమీపంలోని కోతల కోన నారువ ప్రాంతానికి వెళ్లారు. కడుపు నొప్పితో బాధ పడుతున్నట్లు పార్వతి తెలపగా.. కదిరి ఆస్పత్రికి పోదామని చెప్పి జీవాలు తోలుకొచ్చేందుకు జయరాములు వెళ్లాడు. తిరిగొచ్చిన ఆయనకు పార్వతి చెట్టుకు వేలాడుతూ కనిపించింది. తోటి కాపరుల సాయంతో కింద దింపి ఇంటికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు విడిచింది. ఈ విషయాన్ని ఆర్మీలో ఉన్న ఆమె సోదరుడు రామాంజులుకు తెలుపగా, తాను వచ్చే వరకూ దహన సంస్కారాలు చేయవద్దని తెలిపాడు. ఆదివారం వచ్చిన ఆయన.. తన అక్క మృతిపై అనుమానాలు ఉన్నాయని, తగిన విచారణ చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ రామయ్య తెలిపారు.

నేడు బాబయ్యస్వామి గంధం వేడుకలు

పెనుకొండ: దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన బాబయ్యస్వామి ప్రధాన గంధం వేడుకలు సోమవారం అర్ధరాత్రి ప్రారంభం కానున్నాయి. మంగళవారం తెల్లవారుజాము వరకూ సాగనున్నాయి. గంధం వేడుకలకు దర్గాను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో పట్టణానికి తరలిరాగా, వారికి ఇబ్బందులు తలెత్తకుండా పీఠాధిపతి తాజ్‌బాబా సౌకర్యాలు ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ సూచనల మేరకు మున్సిపల్ చైర్మన్ ఫరూఖ్, కమిషనర్ వంశీకృష్ణ ప్రత్యేక చర్యలు చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో దర్గా ముఖద్వారం

'సూక్ష్మ'ంలోనే మోక్షం!



డ్రిప్పు ద్వారా సాగవుతున్న పంట

జిల్లాలో సూక్ష్మసేద్యం ఇలా..

హెక్టార్లు	10వేలు
దరఖాస్తు చేసుకున్న రైతులు	29,646 మంది
ఇప్పటికే పరికరాలు తీసుకున్న వారు	4,983 మంది
ఐదేళ్లలో పరికరాలు అందుకున్న రైతులు	39,647 మంది

- భూగర్భ జల సంరక్షణకు ప్రభుత్వ ప్రాధాన్యం
- సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం
- పరికరాలపై రైతుల్లో ఆసక్తి
- జిల్లాలో ఇప్పటికే లక్ష హెక్టార్లలో వినియోగం

పుట్టపర్తి అర్బన్: భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. బోరు బావి ఉన్న ప్రతి రైతుకూ సబ్సిడీపై డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందిస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ పంటలు సాగు చేసేలా ప్రోత్సహిస్తోంది. జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 10 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం జరిగేలా చూడాలని అధికారులకు లక్ష్యం విధించింది. ఇప్పటి వరకూ 4,983 మంది రైతులకు 5,773 హెక్టార్లలో సాగుకు సూక్ష్మ సేద్య పరికరాలను అందజేశారు. జనవరి నాటికి లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు వేగవంతం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో 8,090 మంది రైతులకు 9,347.70 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు ప్రభుత్వం అందజేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక నాలుగేళ్లు వర్షాలు సమృద్ధిగా కురిశాయి. చెరువులు, కుంటలు, బావుల్లో నీరు చేరాయి. భూగర్భజలాల లభ్యత గణనీయంగా పెరిగింది. దీంతో సూక్ష్మ సేద్య పరికరాలు తీసుకునేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

వైఎస్సార్ హయాంలో బీజం

ఏపీఎంఐపీ పథకానికి 2004లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టింది. 50 నుంచి 90 శాతం సబ్సిడీపై పరికరాలను రైతులకు అందజేసేలా పథకానికి రూపకల్పన చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1,11,431 మంది రైతులకు 1,23,599.94 హెక్టార్లకు సరిపడా పరికరాలను అందజేశారు. సాధారణంగా డ్రిప్, స్ప్రింక్లర్లను 7 నుంచి పదేళ్ల వరకూ వినియోగించవచ్చు. ఆపై ప్రభుత్వం మరోసారి సబ్సిడీపై వాటిని పంపిణీ చేస్తారు.

టీడీపీ హయాంలో భారీ స్కాం

టీడీపీ హయాంలో కరువు విలయతాండవం చేసింది. ఆదుకోవాల్సిన చంద్రబాబు ఆ సమయంలో స్కాంకు తెరతీశారు. రెయిన్ గన్‌లు, స్ప్రింక్లర్లు, డ్రిప్‌లు, డీజిల్ ఇంజిన్ల పేరుతో రైతుల ముసుగులో టీడీపీ నాయకులు సుమారు రూ.450 కోట్లు దుర్వినియోగం చేశారు. పరికరాలను పంట కాలం ముగియగానే వెనక్కు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికీ అందజేయలేదు.

మొక్కకు నేరుగా నీరు



బోర్లలో తక్కువ నీళ్లు ఉన్నా అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు. డ్రిప్పుతో నీరు నేరుగా మొక్కకు చేరుతుంది. దీంతో ఖాళీ ప్రదేశాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరగవు. ప్రతి 7 సంవత్సరాలకూ ప్రభుత్వం సూక్ష్మ సేద్య పరికరాలు అందజేస్తోంది. వీటి వాడకంపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

– చంద్రాయుడు, రైతు, సుబ్బరాయనిపల్లి

రైతుకు లాభాలు



గతంలో పంటలకు కాలువల ద్వారా పారబెట్టే సమయంలో నీరు వృథా అయ్యేవి. సమయం ఎక్కువగా వెచ్చించాల్సి ఉండేది. ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో రైతులు సూక్ష్మసేద్యానికి అలవాటు పడ్డారు. రాత్రిళ్లు వెళ్లి నీళ్లు పారబెట్టే పని లేదు. నీటి ఆదాతో సంవత్సరానికి రెండు, మూడు పంటలు సాగు చేయవచ్చు. దీంతో రైతులకు మరిన్ని లాభాలు చేకూరుతున్నాయి.

– సూర్యనారాయణరెడ్డి, రైతు, కొట్లపల్లి

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఎలా వాడాలనే విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సూక్ష్మ సేద్య పరికరాలతో నీళ్లు వదిలి ఒక చోట కూర్చున్నా పారతాయి. ఈ సమయంలో రైతు మరో పని చేసుకోవడం ద్వారా మరింత ఆదాయం పొందవచ్చు.

– సుదర్శన్, ఏపీఎంఐపీ పీడీ

క్రీడలతో ఉజ్వల భవిత



మారథాన్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో క్రీడలు నిర్వహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో శ్రీకారం చుట్టింది. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే మెగా టోర్నీకి మద్దతుగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో మారథాన్ చేపట్టారు. యువకులు, క్రీడాకారులు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నందిని హోటల్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య, క్రీడా, అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా క్రీడాకారులను ప్రోత్సహించేలా 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహిస్తుండటం గొప్ప విషయమన్నారు. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది నైపుణ్యం కల్గిన క్రీడాకారులు ఉన్నారని, వారి శక్తి సామర్థ్యాలను వెలికితీయడానికి 'ఆడుదాం ఆంధ్రా' ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మారుతీనాయుడు, జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు కేశవరెడ్డి, షెక్షావలి, ఐటీ వింగ్ చంద్రమోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖరరెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, నాయకులు పెన్నోబులేసు, దాదు పాల్గొన్నారు.

లేపాక్షికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి దేవుసింగ్ చౌహాన్



వీరభద్ర స్వామి ఆలయాన్ని సందర్శిస్తున్న మంత్రి

- కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి దేవుసింగ్ చౌహాన్
- వీరభద్రేశ్వర స్వామి ఆలయ సందర్శన

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవుసింగ్ చౌహాన్ తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయాన్ని ఆయన సందర్శించారు. శిల్పాలు, చిత్రలేఖనాలు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలో వీరభద్ర స్వామి, దుర్గాదేవి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. లేపాక్షి ఆలయ సందర్శనకు ఇతర దేశాల నుంచి కూడా అనేక మంది పర్యాటకులు విచ్చేస్తుంటారన్నారు. ఆలయానికి మరింత గుర్తింపు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే యునెస్కో తాత్కాలిక జాబితాలో చేర్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందజేస్తామన్నారు. ఇందుకోసం సమన్వయంతో పనిచేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రూ.1.45 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీడీఓ నరసింహనాయుడు, డిప్యూటీ తహసిల్దార్ కుమార్‌స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2047 కల్లా అగ్రస్థానంలో భారత్

చిలమత్తూరు: 2047 కల్లా ప్రపంచపటంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలపాలన్నది ప్రధాని నరేంద్రమోదీ కల అని కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవుసింగ్ చౌహాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే చలనచిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, వ్యవసాయ ఉత్పత్తులు, మహిళా సంక్షేమం, యువతకు స్వయం ఉపాధి తదితర అంశాలను వివరించారు. కిసాన్ కార్డు, ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన, ప్రధాని జన్‌ధన్ యోజన, ప్రధాన ఆవాస్ యోజన, జల్‌జీవన్ మిషన్ వంటి పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో పేదలకు అందిస్తున్నట్టు తెలిపారు. చిలమత్తూరులో 40 డ్వాక్రా సంఘాలకు రూ.4 కోట్ల చెక్కు, ఎస్‌ఆర్‌ఎల్‌ఎం పథకం ద్వారా రూ. 18.78 లక్షల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప లక్ష్య సాధన ప్రతిజ్ఞ చేయించారు. సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సర్పంచ్ సంధ్య, బీజేపీ నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహమూర్తి తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. రాయలసీమకు రావలసిన హక్కులను సాధించుకోవడం కోసం బుధవారం ఉదయం పది గంటలకు అనంతపురం లలితకళాపరిషత్‌లో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, మేధావులు, నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజా, వెంకటసుబ్బయ్య, కేపీ కుమార్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

శోభాయమానం..హనుమద్‌వ్రతం



హనుమద్ వత్రం నిర్వహిస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమద్‌వ్రతం శోభాయమానంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన హనుమాన్ మాలధారులతో ఆలయ పరిసరాలు కాషాయవర్ణంతో కాంతులీనింది. గంగా నిలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై విశేష పుష్పాలంకరణ గావించి నెట్టికంటి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణల నడుమ హనుమద్ వ్రతం నిర్వహించారు. మాలధారులు సమర్పించిన ఇరుముడిలోని ద్రవ్యాలతో ఉత్సవ మూర్తిని అభిషేకించారు. మూలవిరాట్‌ను స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ గురుప్రసాద్, ఏఈఓ మల్లికార్జున, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కే.సుగణమ్మ, సభ్యులు పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్‌ఐలు సురేష్‌కుమార్, దుగ్గిరెడ్డి తమ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

భక్తరపల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ధ్వజారోహణ చేస్తున్న దృశ్యం



ఆంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు



ప్రత్యేక అలంకరణలో పవనపుత్రుడు



లక్ష్మీనరసింహస్వామికి పుష్పాలంకరణ

మడకశిరరూరల్: మండలపరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ధ్వజారోహణ, అంకురార్పణ పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హనుమంతయ్య, రామాంజనప్ప కుటుంబసభ్యులు, ఆంజనేయస్వామి ఆలయంలో గోవిందరాజులు, రత్నమ్మ కుటుంబ సభ్యులతో పురోహితులు హోమం, హనుమత్ వ్రతం గావించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆంజనేయస్వామి దేవాలయంలో కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఈఓ నాగేంద్రప్రసాదరావు, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, రథోత్సవ కమిటీ చైర్మన్ నాగభూషణ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

చెన్నేకొత్తపల్లి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం పెరవలి గ్రామానికి చెందిన గుంటిక వేణుగోపాల్, బ్రహ్మేంద్ర ఆదివారం వేకువజామున ఆటోలో పూలు లోడు చేసుకుని హిందూపురానికి బయలుదేరారు. మార్గమధ్యంలో చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని ప్యాదిండి ఆంజనేయ స్వామి గుడి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. వేణుగోపాల్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ బ్రహ్మేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై సీకే పల్లి ఎస్ఐ శ్రీధర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆదాయ బాటలో ఆర్టీసీ

- ప్రణాళికలతో బస్సులు తిప్పుతున్న అధికారులు
- యాత్రల పేరుతో ప్రత్యేక సర్వీసులు
- ఈ ఏడాది రూ.2 కోట్ల నష్టాన్ని అధిగమించిన వైనం



పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన కార్గో సెంటర్

పుట్టపర్తి టౌన్: ఆదాయం దిశగా అదనపు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ అడుగులు వేస్తోంది. ప్రజల అవసరాల మేరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతూ నష్టాలను అధిగమించేలా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో అప్పులు... నష్టాలు తప్ప ఆదాయం మిగులు ఉండేది కాదు. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఆర్టీసీ కాస్త ప్రజారవాణా విభాగం (పీటీడీ)గా, కార్మికులందరూ ఉద్యోగులుగా మారారు. బాధ్యతగా ప్రగతి చక్రాలను ముందుకు నడిపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో అందుబాటులో ఉన్న ప్రతి ఆదాయ వనరునూ సద్వినియోగం చేసుకుంటూ నష్టాలను అధిగమిస్తున్నారు. గతంలో బస్సు సర్వీసు ఎరుగని మారుమూల ప్రాంతాలకూ నేడు బస్సులు చేరుకునేలా చర్యలు తీసుకున్నారు.

సేవలోనూ అగ్రస్థానం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రజారవాణా విభాగం ముందజలో నిలుస్తోంది. విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసు సౌకర్యం కల్పించారు. వృద్ధులకు, దివ్యాంగులకు రాయితీతో పాసులు జారీ చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్టేజ్‌లను ఏర్పాటు చేస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. ఈ సేవలతో ప్రజారవాణా విభాగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. నష్టాలను అధిగమించేందుకు తీసుకుంటున్న సరికొత్త నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో 386 బస్సులుండగా రోజూ 1,260 ట్రిప్పులు తిరుగుతున్నాయి. దాదాపు 40 వేల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ఈ లెక్కన రోజుకు రూ.62 లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. కిలో మీటర్‌కు రూ.38 చొప్పున 69 శాతం ఆక్యుపెన్సీతో ప్రజారవాణా విభాగం ప్రగతి పథంలో దూసుకెళుతోంది.

కార్గో సేవలు మరింత విస్తృతం

జిల్లాలో సరుకు రవాణాకు 30 కార్గో బుకింగ్ కేంద్రాలను పీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా 900 బుకింగ్‌లు వస్తుంటాయి. కార్గో సేవల ద్వారా గత ఏడాది రూ.12 కోట్లు ఆదాయం సమకూరగా ఈ ఏడాది ఇప్పటి వరకూ రూ.1.50 లక్షల ఎక్కువగా రూ.13.5 కోట్లకు చేరింది. ఈ క్రమంలో ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు మరింత ఆదాయాన్ని గడించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్గో సేవల ద్వారా ఇంటి వద్దకే సరుకు డెలివరీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ విధానాన్ని మరింత విస్తృతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా బుకింగ్ కేంద్రాలకు అనుమతులు ఇవ్వనున్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

జిల్లాలో పీటీడీని డేంజర్ జోన్ నుంచి ఆదాయం దిశగా నడిపించే చర్యలు వేగవంతమయ్యాయి. ప్రయాణికులు తగ్గిన మార్గాల్లో అందుకు గల కారణాలను అన్వేషించి సమూల మార్పులు చేపట్టారు. ఈ క్రమంలోనే పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. డయల్ యువర్ ఆర్ఎమ్/డీఎమ్ కార్యక్రమాల ద్వారా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అలాగే లక్కీ డ్రిప్ పథకాలు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రయాణికులను ఆకట్టుకున్నారు. ప్రమాదాల నియంత్రణ, ఇంధన పొదుపుపై ఎప్పటికప్పుడు డ్రైవర్లకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ గణనీయ ప్రగతి సాధించారు. ఈ క్రమంలో ఈ ఏడాది రూ.2 కోట్ల నష్టాన్ని జిల్లా ప్రజారవాణా విభాగం అధిగమించింది.

నష్టాలను అధిగమించేలా చర్యలు



ప్రజారవాణా విభాగాన్ని నష్టాలు అధిగమించేలా తీర్చిదిద్దుతున్నాం. జిల్లా వ్యాప్తంగా 8 బస్టాండ్లలో 210 దుకాణాలకు టెండర్లు నిర్వహించి లీజుకు ఇస్తున్నాం. గతంలో వీటి ద్వారా ప్రతి నెలా రూ.18 లక్షల వరకు ఆదాయం వస్తుండేది. వచ్చే ఏడాది రూ.22 లక్షల ఆదాయం సమకూరేలా కార్యాచరణను సిద్ధం చేశాం. ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో ప్రకటన బోర్డుల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం ద్వారా ఆదాయం గడించేలా చర్యలు తీసుకున్నాం. ఉద్యోగుల సమష్టి కృషితో నష్టాలను పూర్తిగా అధిగమిస్తున్నాం. వచ్చే సంవత్సరం జిల్లాకు 50 కొత్త బస్సులు రానున్నాయి.

– మధుసూదన్, డీపీటీఓ

జనవాక్కు

పిల్లలను చదివించుకుంటున్నాం



జగనన్న అందిస్తున్న అమ్మ ఒడి పథకంతో మా పిల్లలను చక్కగా చదివించుకుంటున్నాం. కూలి పనులతో జీవనం సాగిస్తున్న మాకు ఒకప్పుడు పిల్లల చదువులు భారంగా ఉండేవి. గత ప్రభుత్వం పంపిణీ చేసిన నాసిరకం యూనిఫాం కొన్ని రోజులకే చిరిగిపోయేది. దీంతో కొత్త దుస్తులు కుట్టించాలన్నా, నోటు పుస్తకాలు కొనివ్వాలన్నా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీలయ్యేది కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. నాణ్యమైన యూనిఫాంను జగన్ ప్రభుత్వం ఇస్తోంది. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పిస్తున్నారు. పేదల బాగుకోసం పరితపిస్తున్న జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

– సంద్ర లావణ్య, చిల్లవారిపల్లి, తాడిమర్రి మండలం

జీవనాధారం దొరికింది



సీఎం వైఎస్ జగన్ ఇస్తున్న పింఛన్ సొమ్మునే నాకు జీవనాధారంగా మారింది. పింఛన్ వస్తోందనే కుటుంబసభ్యులు నన్ను బాగా చూసుకుంటున్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి రూ.3 వేలు పింఛన్ అందుతుందని చెబుతున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– నాగేశ్వరమ్మ, ముదిగుబ్బ

ప్రాణాలు పోశారు



సీఎం వైఎస్ జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్యశ్రీ పథకం నా ప్రాణాలు కాపాడింది. ప్రమాదవశాత్తు నేను జారి కిందపడడంతో కాలు విరిగి నడవలేకపోయాను. ఆస్పత్రికి వెళ్లి చూపిస్తే ఆపరేషన్ చేయాలని, రూ. లక్ష వరకూ ఖర్చు వస్తుందని చెప్పారు. ఆ సమయంలో ఆస్పత్రిలో ఉన్న ఆరోగ్య మిత్ర నన్ను కలిసి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేస్తారని చెప్పి నా ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం నేను బాగా నడవగలుగుతున్నా. టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా వర్తించకపోవడంతో నాలాంటి పేదలు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని సక్రమంగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ రుణం మరిచిపోలేనిది.

– సుశీలమ్మ, తప్పెటవారిపల్లి, ముదిగుబ్బ మండలం

మళ్లీ సీఎం వైఎస్ జగనే



అర్హతే ప్రామాణికంగా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సంక్షేమ పాలనను గతంలో ఎన్నడూ చూడలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. అమ్మ ఒడి పథకంతో నా కుమార్తె చదువు సజావుగా సాగుతోంది. మా అమ్మ నీలమ్మకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 మంజూరు చేశారు. మా నాన్న వెంకట్రాముడికి వైఎస్సార్ రైతుభరోసా కింద ఏటా 13,500 అందజేశారు. ఎలాంటి సిఫారసు లేకుండా ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం మారితే సంక్షేమ పథకాలు ఆగిపోతాయి. అందుకే ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌నే ఎన్నుకోవాలి.

– కె.నాగరాజు, వజ్రకరూరు

ఉత్కంఠ భరితంగా సూపర్ లీగ్ మ్యాచ్

అనంతపురం: సూపర్ లీగ్ క్రికెట్ టోర్నీలో భాగంగా అనంత క్రీడాగ్రామం వేదికగా ఆదివారం జరిగిన రాప్తాడు, ధర్మవరం జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన రాప్తాడు జట్టు నిర్ణీత 40 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్లు భానుప్రసాద్ 72 పరుగులు, సాత్విక్ 46 పరుగులు చేశారు. ధర్మవరం బౌలర్లలో లోక్‌నాథ్ 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 24 ఓవర్లలోనే 102 పరుగులకు కుప్పకూలింది. రాప్తాడు జట్టు 139 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రాప్తాడు బౌలర్ నిహార్ 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో రాప్తాడు జట్టు ఫైనల్ కి చేరుకుంది.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న కంప్యూటర్ శిక్షణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు అకాడమీ డైరెక్టర్ షేక్ మస్తాన్ వలి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మైనార్టీ, ఇతర బలహీన వర్గాలకు చెందిన వారు అర్హులు. పదో తరగతి ఉత్తీర్ణులై 40 సంవత్సరాల లోపు వయసుండాలి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలి. పూర్తి సమాచారానికి 83280 28735, 83820 75558లో సంప్రదించవచ్చు.

నాలుగు ఇళ్లల్లో చోరీ

బెళుగుప్ప: మండల పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న రెండు గ్రామాల్లోని నాలుగు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. హనిమరెడ్డిపల్లిలో రోడ్డు పక్కనే నివాసముంటున్న బోయ ఓబులేసు శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి పొరుగునే ఉన్న మానిరేవులో నాటకాన్ని చూసేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు లోపలకు చొరబడి బీరువాలోని 17 గ్రాముల బరువున్న ఐదు జతల బంగారు కమ్మలు, రెండు తులాల వెండి సామగ్రి, బోయ ఎర్రిస్వామి ఇంటి వెనుక ఉన్న పశువుల కొట్టంలో నిద్రిస్తుండగా ఇంట్లోకి చొరబడిన దుండగులు 6 గ్రాముల బంగారు కమ్మలు, 14 తులాల వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. అలాగే కాలువపల్లిలో చిరు వ్యాపారి రాఘవేంద్ర ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన దుండగులు లోపలకు చొరబడి 8 తులాల బంగారు, 720 గ్రాముల వెండి వస్తువులను, ఆ పక్కనే నివాసముంటున్న మధుసూన్‌రెడ్డి మేడపై నిద్రిస్తుండడం గమనించి ఇంట్లోకి చొరబడి అందిన వస్తువులను అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, బెళుగుప్ప ఎస్‌హెచ్‌ఓ రామదాసు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఘనంగా పాఠశాల స్వర్ణోత్సవం



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అగళి: మండలంలోని మధుడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా సాగాయి. పూర్వ విద్యార్థులు గ్రామంలో ఎటు చూసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు కట్టి సంబరం చేశారు. భారీ షామియానాల కింద వేలాది మంది పూర్వ విద్యార్థులు చేరి జాతరను తలపించారు. 1973 నుంచి 2023 వరకూ ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులతో పాటు అప్పటి నుంచి ఇప్పటి వరకూ పనిచేసిన ఉపాధ్యాయులను బ్యాచ్‌ల వారీగా వేదికపై ఆహ్వానించి సత్కరించారు. ఒకేసారి చిన్ననాటి స్నేహితులందరూ కలవడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. ప్రధానోపాధ్యాయుడు దాసేగౌడ్ మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో చదువుకున్న వారు ఎంతో మంది డాక్టర్లుగా, చార్టెడ్ అకౌంటెంట్లుగా, ఇంజినీర్లుగా, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, పోలీసు ఉద్యోగులుగా, శాస్త్రవేత్తలుగా, ఉపాధ్యాయులుగా, వ్యాపారవేత్తలుగా స్థిరపడడం ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పూర్వ విద్యార్థులు అలరించారు.

చెరువుల్లోకి ఉచితంగా చేపపిల్లలు



శ్రీధర్‌ఘట్ట చెరువులోకి చేపపిల్లలు వదులుతున్న అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మత్స్యశాఖ క్షేత్రాల్లో అభివృద్ధి చేసిన చేపపిల్లలను చెరువుల్లోకి ఉచితంగా వదిలే కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం ఆత్మకూరు మండలం బి.యాలేరు చెరువులోకి 1.42 లక్షలు, బొమ్మనహాల్ మండలం శ్రీధరఘట్ట చెరువులోకి 16,400 చేపపిల్లలు వదిలారు. ఇప్పటికే పాతకొత్త చెరువు, చాగల్లు రిజర్వాయర్‌లోకి ఉచితంగా చేపపిల్లలు వదిలారు. మూడు నెలల వయస్సున్న ఫింగర్ లింగ్స్ పిల్లలను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ఉచితంగా వదిలినట్లు పీఏబీఆర్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) పెద్దబాబునాయక్ తెలిపారు. ఫిషరీస్ డీడీ ఆదేశాల మేరకు మత్స్యకార సహకార సంఘాల పరిధిలో ఉన్న మరికొన్ని చెరువులు, రిజర్వాయర్లలో త్వరలో చేపపిల్లలు వదలనున్నట్లు తెలిపారు. బి.యాలేరులో జరిగిన కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వై.జనార్దన్‌రెడ్డి, ఎఫ్‌డీఓలు, ఆసీఫ్ లక్ష్మీనారాయణ హాజరు కాగా, శ్రీధర్‌ఘట్టలో జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌డీఓ పెద్దబాబునాయక్, ఎంపీపీ, సర్పంచ్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.







క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న సత్యసాయి విదేశీ భక్తులు ,ప్రశాంతి నిలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ వద్ద విదేశీ భక్తుల సందడి , సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



వెస్టర్న్ క్యాంటీన్‌లో సర్వధర్మాన్ని చాటిచెప్పేలా ఏర్పాటు చేసిన ప్రదర్శన

ఆధ్యాత్మిక పర్తికి క్రిస్మస్ శోభ


ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి క్రిస్మస్ శోభ సంతరించుకుంది. వివిధ దేశాలకు చెందిన సత్యసాయి భక్తులు సత్యసాయి సన్నిధిలో క్రిస్మస్ పర్వదిన వేడుకలను నిర్వహించుకునేందుకు తరలివచ్చారు. సాయి కుల్వంత్ సభా మందిరంతో పాటు ప్రశాంతి నిలయంలోని గద్దె మైదానాలు, విదేశీ భక్తులు సంచరించే ప్రాంతాలను ప్రత్యేక విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ రూపాలు, క్రీస్తు జననం వివరించే రీతిలో నమూనాలను ఏర్పాటు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సత్యసాయి సన్నిధిలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేయనున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు విదేశీ భక్తులు ప్రశాంతి నిలయంలోని సత్సంగ్ భవన్‌లో ఆదివారం ప్రత్యేక సాధన చేశారు.

నేడు ప్రశాంతి నిలయంలో సంబరాలు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన భక్తులు క్రిస్మస్ క్యారల్స్ ఆలపించనున్నారు. సాయంత్రం పలువురు భక్తుల ప్రసంగాలు ఉంటాయి. అనంతరం సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన భక్తుల సంగీత కచేరి ఉంటుంది. చివరన నిక్షిప్తం చేసిన సత్యసాయి వీడియో సందేశాన్ని ప్రదర్శిస్తారు.



గద్దె మైదానంలో ఏర్పాటు చేసిన క్రీస్తు రూపం



ఉత్తర ద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరించే ప్రత్యేక ఘట్టం